మల్లారెడ్డిని అడుగు పెట్టనీయం..

- వ్యక్తిగత ఆరోపణలు చేస్తే ఊరుకోం..
- మల్లారెడ్డి చేసిన అభివృద్ధి శూన్యం
- అందుకే కాంగ్రెస్ పార్టీలో చేరాం..
- ఎల్లంపేట్ గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ



మాట్లాడుతున్న సర్పంచ్, ఎంపీటీసీ తదితరులు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మంత్రి హోదాలో ఉండి మేడ్చల్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదని మేడ్చల్ మండలంలోని ఎల్లంపేట్ గ్రామ సర్పంచ్ వెన్నెల రామకృష్ణుడు, ఎంపీటీసీ కుమార్ యాదవ్ అన్నారు. సోమవారం సాయంత్రం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంత్రి చేసిన అభివృద్ధి శూన్యమని, ఆయన హయాంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. సామాన్యులకు కనీసం పెన్షన్లు, రేషన్ కార్డులు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వలేదన్నారు. గ్రామ సర్పంచ్‌గా అధికార పార్టీలో ఉండి కూడా ఏమీ చేయలేకపోయామని, అందుకే కాంగ్రెస్ పార్టీలో చేరామన్నారు. సోమవారం గ్రామంలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన మంత్రి మల్లారెడ్డి తమపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. మంత్రిగా ఉండి ఏమీ చేయకుండా ఇష్టానుసారంగా తమపై ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని, గ్రామంలో అడుగు పెట్టకుండా చేస్తామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షులు నాగరాజుగౌడ్, గ్రామ అధ్యక్షులు మల్లేశ్, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేశా.. ఓటడుగుతున్నా..



మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్ బీఆర్ఎస్ అభ్యర్థి మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశా.. అందుకే ఓటు వేయాలని అడుగుతున్నా.. నియోజకవర్గ ప్రజలు మరోమారు ఆశీర్వదించి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని మేడ్చల్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మండలంలోని సోమారం, డబీల్‌పూర్, ఎల్లంపేట్, సైదోనిగడ్డ తండా, రావల్‌కోల్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో, కార్నర్ మీటింగ్స్‌లో పాల్గొన్నారు. పీర్జాదిగూడలో కురుమ, యాదవుల ఆత్మీయ సమ్మేళనంలో మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయాల చైర్మన్ దయాకర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత దశలవారీగా సమస్యలను పరిష్కరించి, అభివృద్ధి చేశానన్నారు. జిల్లా రైతుబంధు అధ్యక్షులు నందారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, జెడ్పీటీసీ శైలజ, ఎంపీపీ రజితరాజమల్లారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, వైస్ ఎంపీపీ వెంకటేశ్, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

పార్టీలో చేరికలు..

బీఆర్ఎస్ పార్టీలో చేరికలు పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ సీనియర్ నాయకులు యాదగిరికి మంత్రి మల్లారెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మేడ్చల్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు, యువకులు మల్లారెడ్డి ఎన్నిక ప్రచారంలో భాగంగా మంత్రి సమక్షంలో పార్టీలో చేరారు.

ఇంటింటి ప్రచారం..

మల్లారెడ్డి గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్లు, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, మున్సిపాలిటీల్లో చైర్మన్లు, కౌన్సిలర్లు, నాయకులు, గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఇంటింటి ప్రచారం చేశారు.

మేడ్చల్ ఓటర్లు సిద్ధం..

మల్లారెడ్డి ఇంటికి ఖాయం..

మేడ్చల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వజ్రేష్‌యాదవ్

మేడ్చల్ జోన్ బృందం: మేడ్చల్ నియోజకవర్గ ఓటర్లు మంత్రి మల్లారెడ్డిని ఇంటికి పంపేది ఖాయమని మేడ్చల్ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. సోమవారం ఘట్‌కేసర్ మండలంలోని అంకుషాపూర్, ఎదులాబాద్, అవుషాపూర్, మాదారం, మర్పల్లిగూడ, కొర్రెముల్, చౌదరిగూడలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లకు ముఖ్యఅతిథిగా సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, మేడ్చల్ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, రాష్ట్ర సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించి, కాంగ్రెస్ పార్టీకి ఓటు చేయాలని కోరారు.

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సీఎం కేసీఆర్ నాశనం చేశాడు..

సీఎం కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను నాశనం చేశాడని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు నారాయణ అన్నారు. తెలంగాణ సాధన ఒక్క కేసీఆర్‌తో జరగలేదని, 1400 మంది ఆత్మబలిదానాలతో వచ్చిందని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ వేల కోట్లు దోపిడీ చేశారని, కేసీఆర్ కూతురు ఎమ్మెల్సీ కవిత మద్యం కుంభకోణంలో ఇరుక్కుందని, ప్రశ్నపత్రాల లీకేజీ కుంభకోణం, ప్రాజెక్టుల కుంభకోణాలతో బీఆర్ఎస్ పార్టీ కుంభకోణాల పార్టీగా మారిందన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ మేడ్చల్ ఎమ్మెల్యే అభ్యర్థి వజ్రేష్‌యాదవ్, చిత్రంలో సీపీఐ నారాయణ, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

డేటా స్ట్రక్చర్లతో అనేక అప్లికేషన్లు అభివృద్ధి చేయొచ్చు..

సీఎస్ఈ డీన్ విష్ణుమూర్తి



అనురాగ్ యూనివర్సిటీ వర్క్‌షాప్‌లో విద్యార్థులతో డీన్ విష్ణుమూర్తి

ఘట్‌కేసర్: డేటా స్ట్రక్చర్లతో అనేక రకాల అప్లికేషన్లను అభివృద్ధి చేయవచ్చని సీఎస్ఈ డీన్ విష్ణుమూర్తి అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో డేటా స్ట్రక్చర్స్‌పై కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాస్తవ ప్రపంచంలో డేటా స్ట్రక్చర్లను ఉపయోగించే విధానం, కృత్రిమ మేధస్సు, డేటా రంగాల్లో డేటా స్ట్రక్చర్ల పాత్ర, సైన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ లేటెస్ట్ టెక్నాలజీ గురించి వివరించారు. వర్క్‌షాప్ కో ఆర్డినేటర్ శివప్రసాద్, సీఎస్ఈ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా స్త్రీశక్తి దివస్



ఘట్‌కేసర్: ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని పురస్కరించుకొని ఏబీవీపీ ఆధ్వర్యంలో స్త్రీశక్తి దివస్‌ను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ పరిశుభ్రత కోసం నిరంతరం పాటుపడే పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్యామ్‌కిరణ్, నగర కార్యదర్శి భాను, శివ, చరణ్, సాయి పాల్గొన్నారు.

నూతన టెక్నాలజీతో సమస్యలకు పరిష్కారం చూపాలి



విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న కళాశాల సెక్రటరీ టీవీ రెడ్డి

మేడ్చల్‌రూరల్: ఇంజినీరింగ్ విద్యార్థులు నూతన టెక్నాలజీని వినియోగించుకుని దేశంలో నెలకొన్న సమస్యలకు పరిష్కారాలు చూపేలా ముందుకు సాగాలని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులతో సోమవారం ప్రాజెక్ట్ ఎక్స్‌పో ఇన్నోవేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఎక్స్‌పోలో 142 మంది విద్యార్థులు 24 జట్లుగా ఏర్పడి తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. విద్యార్థుల ప్రాజెక్టులను కళాశాల సెక్రటరీ టీవీ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత, డైరెక్టర్లు పరిశీలించి ఉత్తమ ప్రాజెక్ట్‌కు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ప్రాజెక్ట్ ఎక్స్‌కో నిర్వహించామని తెలిపారు. ప్రస్తుతం సమాజంలో ఉన్న సమస్యలను నూతన పద్ధతుల్లో పరిష్కారం అందించడమే లక్ష్యంగా ప్రాజెక్ట్ ఎక్స్‌పో నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు అనురాగ్‌రెడ్డి, సరోజారెడ్డి, పీఆర్వో రవిసుధాకర్, హెచ్ఓడీ సరిత, ఏవో హరిప్రసాద్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

36 తుపాకుల స్వాధీనం

లాలాపేట: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో పలు చర్యలు తీసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపారు.ఆయన మాట్లాడుతూ.. లైసెన్స్ తుపాకులు కలిగిన 36 మంది వచ్చి పోలీస్ స్టేషన్‌లో వాటిని డిపాజిట్ చేసినట్లు పేర్కొన్నారు. అంతేకాక పలువురిని బైండోవర్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

వైభవంగా కోటి దీపోత్సవం

కవాడిగూడ: ఎన్‌టీఆర్ స్టేడియంలో కొనసాగుతున్న కోటిదీపోత్సవం ఏడో రోజు సోమవారం వైభవంగా జరిగింది. కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని పురుషోత్తమ భారతి మహాస్వామీజీ (శివగంగా మఠాధిపతి), అనుగ్రహం భాషణం వినిపించగా బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనామృతం వినిపించారు. ప్రధాన వేదికపై నర్మదా బాన లింగానికి కోటి భస్మార్చన పూజ నిర్వహించారు. అనంతరం అరుణాచలేశ్వర స్వామి కల్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి హరీష్‌రావు హాజరయ్యారు.

ఓటమి భయంతోనే బీఆర్ఎస్ నేతల దాడులు



సమావేశంలో నగర అధ్యక్షుడు తుంగతుర్తి రవి

మేడిపల్లి: మేడ్చల్ బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి మల్లారెడ్డి ఆగడాలకు ముగింపు పలికే రోజులు దగ్గరపడ్డాయని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ పీర్జాదిగూడ నగర అధ్యక్ష, కార్యదర్శులు తుంగతుర్తి రవి, పన్నా శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్ అజయ్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల్లో అక్రమ మార్గాల్లో గెలిచేందుకు పన్నాగం పన్నుతూ.. కాంగ్రెస్ కార్యకర్తలపై దౌర్జన్యాలు, భౌతిక దాడులను తెగబడుతూ.. ఎలక్షన్ కమిషన్ నిబంధనల తుంగలో తొక్కుతూ భయాందోళనకు గురి చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకుల గుండాగిరి, దౌర్జన్యాలకు కాంగ్రెస్ పార్టీ ఏనాడూ బెదరదని, వారి ఆగడాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

- ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు మేడిపల్లిలోని ఏవీ ఇన్ఫోప్రైడ్‌లో అక్రమంగా నగదు నిల్వ చేశారని, విశ్వసనీయ సమాచారంతో ఆదివారం రాత్రి ఎన్నిల అధికారులు, పోలీసులు తనిఖీలు చేపడుతుండగా అక్కడికి చేరుకున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై స్థానిక మేయర్, ఆయన అనుచరులు దాడికి పాల్పడటమే కాకుండా మహిళలపై అసభ్యంగా ప్రవర్తించడం సిగ్గుచేటని విమర్శించారు.
- అపార్ట్‌మెంట్‌లోని ఓ ఫ్లాట్‌లో పంపిణీకి సిద్ధంగా చీరలు, నగదు ఉంచారన్నారు. మంత్రి మల్లారెడ్డిపై కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. బర్త్‌డేలు, పెళ్లి రోజుల పేరుతో మందు పార్టీలను ఏర్పాటు చేస్తూ ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారని అన్నారు. ఎన్నికల నియమావళికి తూట్లు పొడుస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని దుయ్యబట్టారు.
- బీఆర్ఎస్ నాయకులపై అధికారులు చర్యలు తీసుకోకుండా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తను వేధింపులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అక్రమంగా మద్యం నిల్వచేస్తే కఠిన చర్యలు





గోదాం నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు మాదవయ్య, నవనీత

మేడ్చల్‌రూరల్: గోదాముల్లో అక్రమంగా మద్యం నిల్వ ఉంచి సరఫరా చేస్తే కఠిన చర్యలు తప్పవని అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి మాదమయ్య, మేడ్చల్ ఎక్సైజ్ సీఐ నవనీత తెలిపారు. మేడ్చల్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవరయాంజాల్‌లో మద్యం గోదాంలలో సోమవారం తనిఖీలు నిర్వహించారు. రికార్డులు, మద్యం కాటన్లను పరిశీలించారు. నిర్వాహకులు మద్యం నిల్వలు, సరఫరాపై ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఎవరైనా గోదాములలో అక్రమంగా మద్యం నిల్వ చేసి, సరఫరా చేస్తే కేసులు నమోదు చేసి కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా అక్రమంగా మద్యం నిల్వ చేసినా, సరఫరా చేసినా తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. తనిఖీల్లో బాలానగర్ ఎక్సైజ్ సీఐ వేణుకుమార్, ఎస్సైలు సలీం, శ్యాంకుమార్, అనిత, రఘు, యూసఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

భూములపై హక్కులు కల్పించండి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు తదితరులు

కలెక్టర్‌కు బొమ్మరాసిపేట రైతుల వినతి

సాక్షి, మేడ్చల్ జిల్లా: శామీర్‌పేట మండలంలోని బొమ్మరాసిపేట గ్రామంలోని సర్వే నంబర్లు 323 నుంచి 407 పరిధిలో ఉన్న 1065 భూములపై ఎటువంటి సర్వేగానీ, లావాదేవీలు జరగడానికి వీలు లేదని హైకోర్టు జారీ చేసిన ఆదేశాలను రెవెన్యూ యంత్రాంగం పాటించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.గౌతమ్‌కు బొమ్మరాసిపేట ఫార్మర్స్ వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి ఎస్.ఎ.వి సత్యనారాయణ రాజు, వైస్ ప్రెసిడెంట్ వి.రామచంద్రారావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు కె.వి.రమణారెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ పి.గౌతమ్‌కు వారు వినతి పత్రం అందజేశారు.

- ఇదే విషయాన్ని గతంలో పలువురు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బొమ్మరాసిపేట గ్రామ సర్వే నంబర్లు 323 నుంచి 407 పరిధిలో ఉన్న 1065 ఎకరాల భూమిని సంబంధిత రైతులు 45 ఏళ్ల కిందట కొనుగోలు చేసి, సాగు చేసుకుంటున్నారని వారు పేర్కొన్నారు. ఈ భూముల దస్తావేజులు, పాసు పుస్తకాలను కూడా రైతులు కలిగి ఉన్నారని తెలిపారు. ఇందులో కొంత మంది రైతులకు రైతు బంధు పథకం కింద పంట సాగు సాయం కూడా అందుతున్నారు.
- ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత నుంచి రెండున్నర ఏళ్లుగా రైతులు ఈ భూములకు సంబంధించిన సమస్యను ఎదుర్కొంటున్నారన్నారు. రెవెన్యూ అధికారులు రైతులు కొనుగోలు చేసిన మొత్తం భూములను ధరణి పోర్టల్లో ప్రొహిబిట్ లిస్టులో పెట్టడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు. అప్పటి నుంచి రైతులు భూ సమస్య పరిష్కారం కోసం రెవెన్యూ అధికారులు, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు.
- తమ భూములను ధరణి నిషేధిత జాబితా నుంచి తొలగించి, క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ తదితర లావాదేవీలు నిర్వహించుకోవడానికి అవకాశం కల్పించాలని వారు కలెక్టర్‌ను కోరారు. హైకోర్టు జారీ చేసిన ఆదేశాలకు విరుద్ధంగా కొందరు అధికారులు వ్యవహరించిన తీరుపై కోర్టుకు వెళ్లడానికి రైతులు సిద్ధంగా ఉన్నట్లు బొమ్మరాసిపేట ఫార్మర్స్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు సత్యనారాయణరాజు, వి.రామచంద్రారావు, రమణారెడ్డి తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించిన రైతులు రెవెన్యూ శాఖ తీరుపై నిరసన తెలిపారు.

కాంగ్రెస్ కార్పొరేటర్ అనిత ఇంటికి ప్రీతిరెడ్డి

- కారుకు అడ్డంగా కాంగ్రెస్ నేతల నిరసన
- ఎన్నికల్లో ప్రలోభపెడుతున్నారని ఆగ్రహం

బోడుప్పల్: కాంగ్రెస్ పార్టీ 13వ డివిజన్ కార్పొరేటర్ దానగల్ల అనిత ఇంటికి సోమవారం బీఆర్ఎస్ మహిళా విభాగం నాయకురాలు చామకూర ప్రీతిరెడ్డి వచ్చారు. గతంలో కాంగ్రెస్ తరఫున గెలుపొందిన దానగల్ల అనిత బీఆర్ఎస్‌లో చేరగా, వారం రోజుల క్రితం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ క్రమంలో ప్రీతిరెడ్డి కలిసి మళ్లీ బీఆర్ఎస్‌లో చేరాలని కోరారు.. తమను బీఆర్ఎస్‌లో చాలా ఇబ్బందులకు గురి చేశారని అందుకే కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వివరించారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కార్పొరేటర్ ఇంటి వద్దకు చేరుకున్నారు. కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ ఇంటికి వచ్చి ఎన్నికల సమయంలో ప్రలోభపెడుతున్నారని వాదించారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో మంత్రి మల్లారెడ్డి కోట్ల రూపాయలకు టిక్కెట్లు అమ్ముకున్నారని, అలాంటి వారికి ఓట్లు వేయవద్దంటూ నినాదాలు చేశారు. అక్కడ నుంచి ప్రీతిరెడ్డి కారులో వెళ్తుండగా రోడ్డుకు అడ్డంగా కూర్చొని నిరసన తెలిపారు. కాంటెస్టెడ్ కార్పొరేటర్ రాపోలు ఉపేందర్, నాయకులు చెంచల నర్సింగ్‌రావు, గోపు రాము, జయేందర్‌రెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు ఉన్నారు.

మంత్రి మల్లారెడ్డి బలవంతంగా కండువా కప్పారు: కార్పొరేటర్ భర్త

బోడుప్పల్: 13వ డివిజన్ కార్పొరేటర్ దానగల్ల అనిత భర్త యాదగిరి మంత్రి చామకూర మల్లారెడ్డి సమక్షంలో సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యాదగిరి మాట్లాడుతూ వారం రోజుల క్రితం కార్పొరేటర్ అనిత, తాను టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరాం. మంత్రి మల్లారెడ్డి తనను సోమవారం పిలిచి బలవంతంగా కండువా కప్పారని వెల్లడించారు. తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానంటూ సోమవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ తరఫున దేవేందర్‌నగర్ ఫేస్–2లో ప్రచారం నిర్వహించడం గమనార్హం.

కాంగ్రెస్ నేతపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

కుషాయిగూడ: ఉప్పల్‌కు చెందిన చిలుముల శ్రీనివాస్‌రెడ్డిపై కుషాయిగూడ పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ వివరాల ప్రకారం.. ఎన్నికల నేపథ్యంలో ఏఎస్‌రావు నగర్ డివిజన్ కమలానగర్‌లోని ఓ ఇంట్లో కాంగ్రెస్ పార్టీ బూత్‌కమిటీ సమావేశం జరిగింది. కాప్రాకు చెందిన కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా ఎస్సీ వింగ్ బాధ్యుడు పత్తికుమార్‌పై ఉప్పల్‌కు చెందిన చిలుముల శ్రీనివాస్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేసి దుర్భాషలాడాడు. మనస్థాపం చెందిన ఆయన శ్రీనివాస్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కుషాయిగూడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

సీనియర్ జర్నలిస్టు ఎర్రం నర్సింగరావు ఆత్మహత్య

ముషీరాబాద్: సీనియర్ జర్నలిస్టు, వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎర్రం నర్సింగరావు సోమవారం తెల్లవారుజామున కవాడిగూడలోని బీఎస్‌నగర్‌లో గల తన నివాసంలో మెట్ల రైలింగ్ ఇనుప రాడ్డుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నర్సింగరావుకు రెండుసార్లు కరోనా సోకడంతో తీవ్ర అనారోగ్యానికి లోనయ్యారు. దీనికి తోడు టీబీ కూడా సోకింది. నిత్యం ఆసుపత్రుల చుట్టు తిరగడంతో పాటు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. దీంతో మనస్తాపానికి లోనైన ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డారు. తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జైసింహ, సికింద్రాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు అంజన్‌కుమార్‌యాదవ్, వి.శ్రీనివాస్‌రెడ్డి, ఎంఎస్ శ్రీనివాస్‌రావు, ఎం.అనిల్ కుమార్‌యాదవ్, పూస రాజు, మందకృష్ణమాదిగ, రామకృష్ణ మఠం అధ్యక్షులు బోధమయానంద, వి.సంధ్య, సజయ నివాళులర్పించారు.

కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: నూతన్‌కల్ సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల నరికివేత కారణంగా మంగళవారం నూతన్‌కల్ పరిధిలో కరెంట్ సరఫరా ఉండదని రూరల్ ఏఈ పవన్‌చందు తెలిపారు. గ్రామ పరిధిలోని అన్ని డొమస్టిక్, అగ్రికల్చర్, ఇండస్ట్రియల్ సర్వీసులకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

నేడు కార్నర్ మీటింగ్‌లు

మేడ్చల్: బీఆర్ఎస్ ప్రచారంలో భాగంగా మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో కార్నర్ మీటింగ్‌లు నిర్వహిస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు దయానంద్‌యాదవ్ తెలిపారు. మండలంలోని నూతన్‌కల్, కోనాయిపల్లి, బండమాదారం, మైసిరెడ్డిపల్లి, లింగాపూర్, రాజబొల్లారం తండా, అక్బర్జాపేట్, రాజబొల్లారం, ఘనాపూర్, పూడూర్ గ్రామాల్లో నిర్వహించే సమావేశాల్లో మంత్రి మల్లారెడ్డి పాల్గొంటారని ఆయన తెలిపారు.

పోషకాహార లోపానికి పరిష్కారంగా..

సాక్షి, సిటీబ్యూరో: పిల్లల ఎదుగుదల, అభివృద్ధికి తోడ్పడేందుకు అంతర్జాతీయ ఆరోగ్య సంరక్షణ కంపెనీ అబాట్ న్యూట్రీపుల్ సిస్టమ్‌తో కూడిన కొత్త పెడియా ష్యూర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ విషయాన్ని సంస్థ నగరం ప్రతినిధులు తెలిపారు. దీనిలో విటమిన్ ఓ2, విటమిన్ ఇ వంటి పోషకాలతో పాటు ఖనిజాలను శోషించడానికి తోడ్పడే కేసైన్ ఫాస్ఫోపెప్టైడ్స్ తదితర పదార్థాల మేలు కలయికగా ఇది రూపొందిందని, కీలక పోషకాలను అందుకునేలా చేసి, చిన్నారుల సమగ్రాభివృద్ధి, పెరుగుదలకు ఇది సహకరిస్తుందన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కీసర: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల పరిధిలో రేషన్ బియ్యంను లబ్ధిదారుల నుంచి సేకరించి తరలిస్తున్న ఆటోను కీసర పోలీసులు పట్టుకున్నారు. వివరాలు.. నల్గొండ జిల్లా బొమ్మలరామారంకు చెందిన ఆటో డ్రైవర్ మాలోతు సురేష్ నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీ ప్రాంతాల్లో రేషన్ లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు బియ్యం సేకరించి భువనగిరిలో రీసైక్లింగ్ చేసే రైస్‌మిల్లుకు తన టాటా ఆటో ట్రాలీలో కీసర మీదుగా తరలిస్తుండగా కీసర పోలీసులు వాహనంతో పాటు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కీసర పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



నాగరాజు(ఫైల్)

జవహర్‌నగర్: వ్యక్తి అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. జవహర్‌నగర్ ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీలో రావు నాగరాజు(38) యాప్రాల్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో సెక్యూరిటీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. భార్య చంద్రకళ ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తున్నారు. ఈ నెల 13న నాగరాజు నైట్ డ్యూటీకి వెళ్లి 14న తిరిగి వచ్చాడు. చంద్రకళ అమ్మమ్మ మరణవార్త తెలియగా అంత్యక్రియల కోసం దమ్మాయిగూడకు వెళ్లింది. ఈ నెల 18న ఇంటికి వచ్చిన చంద్రకళ భర్త నాగరాజుకు ఫోన్ చేయగా స్పందించలేదు. నాగరాజు పనిచేసే కంపెనీ వద్ద వెళ్లి సంప్రదించగా 14వ తేదీ నుంచి డ్యూటీకి రావడంలేదని తెలిపారు. అతడి ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు రోజుల క్రితం బెంగళూరు నుంచి ఫోన్ చేసి తన భర్త గురించి విచారించి కాల్ డిస్‌కనెక్ట్ చేశారని ఆమె తెలిపింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కీసర: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని యాద్గార్‌పల్లి –కీసర ప్రధాన రహదారిలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్ల సముదాయాల సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ ప్రాంతానికి చెందిన నరేందర్(29) సోమవారం ఉదయం మేడ్చల్ నుంచి యాద్గార్‌పల్లి మీదుగా కీసరకు తన బైక్‌పై వస్తుండగా యాద్గార్‌పల్లి డబుల్‌బెడ్‌రూం ఇళ్ల సముదాయం సమీపంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న కల్వర్టును ఢీకొట్టాడు. ఈ ఘటనలో కల్వర్టు పక్కనే ఉన్న నీటి గుంతలో పడిపోయాడు. రహదారిపై ఉన్న బైక్‌ను చూసిన స్థానికులు కీసర పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కల్వర్టు పక్కన ఉన్న నీటిగుంతలో పడిఉన్న అతడిని బయటకు తీయగా అప్పటికే మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నటు పోలీసులు తెలిపారు.

హాస్టల్ భవనంపై సెల్ టవర్‌ను తొలగించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని సెంటినరీ మహిళ హాస్టల్ భవనంపై ఏర్పాటు చేసిన సెల్ టవర్‌ను వెంటనే తొలగించాలని పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు డిమాండ్ చేశారు. హాస్టల్ భవనంపై ఏర్పాటు చేసిన సెల్ టవర్‌తో విద్యార్థినులు వివిధ రకాల అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని చీఫ్ వార్డెన్ డా.శ్రీనివాస్‌రావుకు వినతి పత్రం అందజేశారు. హాస్టల్ భవనంపై కాకుండా మరో ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రావణ్, సుమన్, శ్రావణి, మనీషా, అనూష, నిహారిక, కాసింబి, సంపత్, ప్రవీణ్ పాల్గొన్నారు.